క్లుప్తంగా

నేడు 'ఏడుకోలల బాయి' పుస్తకావిష్కరణ

చిట్యాల : మండలంలోని వట్టిమర్తి గ్రామంలో బుధవారం ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి రచించిన 'ఏడుకోలల బాయి' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సృజన సాహితి సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు పెరుమాళ్ల ఆనంద్, సాగర్ల సత్తయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్రా ఫౌండేషన్ వారు ప్రచురించిన ఈ పుస్తకాన్ని మాజీ ఎమ్మెల్యే నర్రా రాఘవరెడ్డికి అంకితమిచ్చినట్లు తెలిపారు.

కట్టంగూర్ ఎస్ఐగా రవీందర్



కట్టంగూర్ : మండల ఎస్ఐగా ఎం.రవీందర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్ఐ ఎన్. శ్రీను నల్లగొండ వీఆర్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఎం రవీందర్‌కు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్ ట్రాన్స్‌కోలో పనిచేస్తూ బదిలీపై మండలానికి వచ్చారు.

కందాల పాపిరెడ్డికి సన్మానం



పాపిరెడ్డిని సన్మానిస్తున్న ప్రతినిధులు

నకిరేకల్ : పట్టణానికి చెందిన కందాల పాపిరెడ్డి ఇటీవల ట్రస్మా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక ఏవీఎం విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏవీఎం విద్యాసంస్థల ప్రిన్సిపాల్ కందాల స్వప్నారెడ్డి, అడ్మినిస్ట్రేటర్స్ కందాల శ్రీకాంత్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, పీఈటీ నిమ్మల శంకర్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూమిని పేదలకు పంపిణీ చేయాలి

నార్కట్‌పల్లి : మండలంలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామంలో సర్వే నంబర్ 280లో ఉన్న 10.09ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు పంపిణీ చేసి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని మాజీ వైస్‌ఎంపీపీ కల్లూరి యాదగిరి, సీపీఎం మండల కార్యదర్శి చెర్కు పెద్దులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పార్టీ మండల కమిటీ సభ్యులు దండు రవి, దండు నాగరాజు, శంకర్, భాష, సైదులు, శంకరయ్య ఉన్నారు.

పనుల్లో నాణ్యత లోపించొద్దు

మునుగోడు : బీటీరోడ్ల నిర్మాణంలో నాణ్యత లోపించొద్దని పంచాయతీరాజ్ డీఈ నాగేశ్వర్ రావు అన్నారు. ఇటీవల సీఆర్ఆర్ నిధుల నుంచి మంజూరైన మండలంలోని బీరేల్లిగూడెం, గుండ్లోరిగూడెం, ఊకొండి తదితర గ్రామాల్లో కొనసాగుతున్న బీటీరోడ్ల నిర్మాణం పనులను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. నిర్ణీత కొలతల ప్రకారం రోడ్డుకు ఇరువైపులా చెట్లను తొలగించి మట్టిని పోయించాలని సూచించారు. అదే విధంగా రోడ్డుకు ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు కల్వర్టుల నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఆయన వెంట ఏఈ సతీష్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

అర్ధాకలితో కార్మికుల అవస్థలు

- నాలుగు నెలలుగా అందని వేతనాలు
- అప్పులు చేసి కుటుంబ పోషణ
- ఆదుకోవాలని కోరుతున్న చండూరు మున్సిపల్ కార్మికులు



చండూరు మున్సిపల్ కార్యాలయం

చండూరు : చండూరు మున్సిపల్ కార్మికులకు సుమారు నాలుగు నెలలుగా వేతనాలు అందడం లేదు. ఫలితంగా కార్మికుల కుటుంబాలు అర్ధాకలితో అలమటిస్తున్నాయి. పూట గడుపుకునేందుకు కార్మిక కుటుంబాలు ప్రైవేట్ ఫైనాన్స్‌లను ఆశ్రయిస్తున్నారు. అధికారులు ఐదారు నెలలకు ఒకమారు ఒక నెల జీతం అందిస్తే తెచ్చుకున్న అప్పులకు వడ్డీలకే సరిపోవడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

49 మంది కార్మికులు..

చండూరు మున్సిపాలిటీ పరిధిలో 49 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఇందులో 25 మంది పారిశుద్ధ్య కార్మికులు, 9 మంది వాటర్ మెన్స్, ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు, ముగ్గురు ఎలక్ట్రీషియన్స్, ఐదుగురు బిల్ కలెక్టర్లు, ఇద్దరు అటెండర్స్, ఇంకా ఇతర సిబ్బంది ఉన్నారు. వీరికి నెలకు సుమారు రూ.9 లక్షల 66 వేల వరకు వేతనాలు చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటికి పారిశుద్ధ్య కార్మికులకు నాలుగు నెలలు, ఇతర సిబ్బందికి ఐదు నెలల వరకు వేతనాలు చెల్లించాల్సి ఉంది. కార్మికులకు దాదాపు రూ.54 లక్షల వరకు వేతనాలు చెల్లించాల్సి ఉంది.

టాక్స్ వసూలు కాకపోవడంతో..

చండూరు మున్సిపాలిటీలో ట్యాక్స్‌లు వసూలు కాకపోవడం, ప్రభుత్వ నుంచి వచ్చే నిధులు రాకపోవడంతో మున్సిపల్ కార్యాలయ ఖాతాల్లో నగదు జీరోగా ఉంది. పంటలకు పెట్టుబడి సీజన్ కావడంతో రైతులు ట్యాక్స్‌లు చెల్లించలేకపోతున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు, జనరల్ ఫండ్ రాకపోవడంతో కార్యాలయానికి ఇతర ఆదాయం లేకుండా పోయింది. దీంతోపాటు గతంలో చెల్లించాల్సిన బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో కార్మికులకు జీతాలు చెల్లించలేకపోతున్నారు.

ఇంకా పాత ట్యాక్స్ విధానమే..

చండూరు గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా ఏర్పాటైన నాటినుంచి నేటి వరకు పాత ట్యాక్స్‌నే అధికారులు వసూలు చేస్తున్నారు. దీంతో మున్సిపాలిటీ ఆదాయం తగ్గిందని అధికారులు చెబుతున్నారు. ఇటీవల అధికారులు పన్ను రివిజన్ అనుమతికి కలెక్టర్‌కు సిఫారసు చేశారు. అనుమతి రాగానే ట్యాక్స్‌లు పెరిగే అవకాశం ఉంది. ప్రతినెలా రూ.3 లక్షల వరకు ట్యాక్స్‌లు వసూలు కావాల్సి ఉండగా ప్రస్తుతం ప్రతినెలా రూ.1.20 లక్షల వరకు వసూలు అవుతున్నాయి. ప్రతినెలా వేతనాలు అందకపోవడంతో పూట గడుపుకునేందుకు చేతిలో చిల్లి గవ్వలేక కార్మికులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. పాలకులు స్పందించి తమకు పెండింగ్ వేతనాలు చెల్లించడంతోపాటు ప్రతినెలా క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించాలని కార్మికులు కోరుతున్నారు.

ప్రతినెలా జీతం అందించాలి



నెలనెలా జీతాలు అందక అప్పులు చేస్తున్నాం. ఐదారు నెలలకు ఒకసారి ఓ నెల జీతం అందిస్తే వడ్డీలకు సరిపోవడం లేదు. పనిచేసి అప్పులు చేసుకుని పూట గడుపుకోవాల్సి వస్తోంది. కార్మికులకు ప్రతినెలా జీతం అందేలా చూడాలి.

– కత్తుల సైదులు, కార్మికుడు

అప్పులతో కాలం వెళ్లదీస్తున్నాం



పొద్దస్తమానం పనిచేసి ఇంటికి పోతే పూట గడుపుకునేందుకు ఇబ్బంది పడాల్సి వస్తోంది. నిత్యం అప్పు తెచ్చి కాలం వెళ్లదీస్తున్నాం. అధికారులు స్పందించి కార్మికులకు ప్రతినెలా జీతం అందించే విధంగా చర్యలు తీసుకోవాలి.

– కళమ్మ, కార్మికురాలు

ఆదాయ మార్గం లేదు

చండూరు మున్సిపాలిటీకి ఆదాయం మార్గం లేకపోవడంతో కార్మికులకు వేతనాలు అందజేయలేకపోతున్నాం. నాలుగు నెలల వేతనాలు అందించాల్సి ఉంది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాం.

– మున్వర్ అలీ, చండూరు మున్సిపల్ కమిషనర్

పారిశుద్ధ్య నిర్వహణతో సీజనల్ వ్యాధులు దూరం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న చరిత

శాలిగౌరారం : గ్రామాలతో పాటూ ప్రతీ ఇంట్లో పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా చేపడితే సీజనల్ వ్యాధులు దరిచేరవని మండల ప్రత్యేక అధికారి, జిల్లా మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సుచరిత అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామపంచాయతీల నిర్వహణతో పాటు ఉపాధిహామీ పథకంపై సంబంధిత సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలడంతో ప్రజలు ఆరోగ్యపరంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తిని నిరోధించేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ఆయ శాఖ సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణతో పాటు రోడ్లు, వీధుల వెంట పిచ్చిమొక్కల తొలగింపు, పచ్చిగడ్డి కత్తిరించడం, దోమల నివారణకు ఫాగింగ్ చేయడం, నీటినిల్వ గుంతలలో బ్లీచింగ్ చల్లడం, తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. బుధవారం నుంచి గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్న నేపథ్యంలో పనుల నిర్వహణపై ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, ఎంపీఓ పద్మ, ఏపీఓ జంగమ్మ, ఉపాధిహామీ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

నిత్యావసర ధరలపై సమీక్ష నిర్వహించాలి

చిట్యాల : పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలపై అధికారులు సమీక్షలు నిర్వహించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు లోడంగి శ్రవణ్‌కుమార్ డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో మండల డిప్యూటీ తహసీల్దార్ విజయకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి అక్బర్, పట్టణ కార్యదర్శి ఎస్‌కె.షరీఫ్, నాయకులు దేశగాని బాలరాజు, వెంకన్న, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ చరిత్రను చదివి ఆచరించాలి



గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కనగల్ : విద్యార్థులు మహాత్మాగాంధీ జీవిత చరిత్రను చదివి ఆశయాలను, సిద్ధాంతాలను పాటించాలని పాఠశాల హెచ్‌ఎం పద్మ, రచయిత కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చిన్నమాదారం జెడ్పీ పాఠశాలలో ముందస్తుగా గాంధీజీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. విద్యార్థులు ఆటపాటలతో బతుకమ్మలు పేర్చి ఆడి పాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వృద్ధుడికి గాయాలు

నార్కట్‌పల్లి: కారు అతివేగంగా వచ్చి ఢీకొనడంతో ఓ వృద్ధుడికి తీవ్రగాయాలైన సంఘటన నార్కట్‌పల్లి మండలంలోని గోపలాయపల్లి స్టేజీ వద్ద మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గోపలాయపల్లి గ్రామానికి చెందిన దండిగా యాదయ్య చిట్యాలకు పని నిమిత్తం వెళ్లాడు. పని ముగించుకుని గోపలాయపల్లి స్టేజీ వద్ద తన సొంత గ్రామానికి వచ్చేందుకు జాతీయ రహదారి దాటుతుండగా హైదరాబాద్ నుంచి నార్కట్‌పల్లి వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి అతడిని ఢీ కొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో సమీపాన ఉన్న ప్రజలు గమనించి 108 అంబులెన్స్ సహాయంతో యాదయ్యను నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఖాయం

మునుగోడు: ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి రావడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ మునుగోడు మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు అన్నారు. మంగళవారం మునుగోడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాజగోపాల్‌రెడ్డి మునుగోడు నియోజకవర్గానికి అధిక నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. మంత్రి పదవి వచ్చాక అన్ని గ్రామాలను మరింత ఆదర్శంగా తీర్చిదిద్దుతారని అన్నారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్వాయి చెన్నారెడ్డి, నాయకులు దొటి నారాయణ, దండు లింగస్వామి, గుంటుక కృష్ణయ్య, తీగల స్వామి పాల్గొన్నారు.

జెడ్పీ స్టడీ సెంటర్‌లో శిక్షణ పొందిన అభ్యర్థులకు ఉద్యోగాలు



టి.పావని, ఎస్‌జీటీ



జె.నరేష్, ఎస్‌జీటీ



ఎస్.శివ, ఎస్‌జీటీ



కె.శంకర్, స్కూల్‌అసిస్టెంట్

నల్లగొండ : ప్రభుత్వ ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో నల్లగొండ పట్టణంలోని జెడ్పీ స్టడీ సెంటర్‌లో శిక్షణ పొందిన అభ్యర్థులకు ఉద్యోగాలు దక్కాయి. కనగల్ మండలంలోని జి.ఎడవల్లికి చెందిన కె.శంకర్‌కు లాంగ్వేజీ పండిట్‌లో 1వ ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్‌లో 6వ ర్యాంకు సాధించాడు. అదే విధంగా చండూరు మండలంలోని కస్తాలకు చెందిన జె.నరేష్‌కు ఎస్‌జీటీలో 15వ ర్యాంకు, అడవిదేవులపల్లి మండలానికి చెందిన టి.పావనికి ఎస్‌జీటీలో 86వ ర్యాంకు, గుర్రంపోడు మండలంలోని కొప్పోలు గ్రామానికి చెందిన ఎస్.శివ ఎస్‌జీటీలో 246వ ర్యాంకు పొందాడు. ఈ సందర్భంగా వారిని మంగళవారం జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి అభినందించారు.

డీఎస్సీలో వెంకటేష్‌కు రెండు ఉద్యోగాలు



కట్ట వెంకటేష్

కనగల్ : డీఎస్సీ ఫలితాల్లో మండల పరిధిలోని పానుగోడు గ్రామానికి చెందిన కట్ట వెంకటేష్ రెండు ఉద్యోగాలు సాధించారు. స్కూల్ అసిస్టెంట్ (తెలుగు) సబ్జెక్టులో 70.83 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో 2వ ర్యాంక్, భాషా పండిట్ (తెలుగు) సబ్జెక్టులో 72.33 మార్కులు సాధించి జిల్లాలో 3వ ర్యాంక్ సాధించాడు. వెంకటేష్ రెండు నెలల క్రితమే గురుకుల పాఠశాలలో టీజీటీగా ఉద్యోగం సాధించారు. వెంకటేష్ తల్లి లలిత, తండ్రి యాదయ్య వ్యవసాయ కూలీలు.

స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్జీటీలో మొదటి ర్యాంకు



చెరుపల్లి భారవి

కేతేపల్లి : ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో కేతేపల్లి మండల కేంద్రంలో ఐఈఆర్పీగా పనిచేస్తున్న చెరుపల్లి భారవి స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్జీటీ పోస్టులో 74.80మార్కులతో జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. నల్లగొండ పట్టణానికి చెందిన చెరుపల్లి మారయ్య–నవనీత దంపతుల కుమారుడైన భారవి టీటీసీ స్పెషన్ ఎడ్యుకేషన్ విద్యనభ్యసించాడు. ఈ సందర్భంగా భారవిని మంగళవారం ఎంఈఓ రాంజేంద్రప్రాద్, కాంప్లెక్స్ హెచ్‌ఎం లాజరస్, ఐఈఆర్పీ సునీత, సీఆర్పీలు మల్లయ్య, మహేందర్ అభినందించారు.

జమిలి ఎన్నికల నిర్వహణ రాజ్యాంగ విరుద్ధం



పార్టీలో చేరుతున్న వారికి కండువాలు కప్పుతున్న బొంతల చంద్రారెడ్డి, తుమ్మల వీరారెడ్డి

చిట్యాల : దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణ రాజ్యాంగ విరుద్ధమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వెలిమినేడు గ్రామంలో నిర్వహించిన ఆ పార్టీ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను హరించడానికి ఆర్‌ఎస్‌ఎస్ విధానాలను అమలు చేసేందుకుగాను జమిలి ఎన్నికల అంశాన్ని బీజేపీ తీసుకువస్తుందన్నారు. దేశంలో 26పార్టీలు జమిలి ఎన్నికలను వ్యతిరేకించినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం గ్రామానికి చెందిన సుర్కంటి మోహన్‌రెడ్డి, మేడి యాదయ్య, అంతటి నర్సింహతో పాటు మరికొందరు పార్టీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. నెల్లికంటి నర్సింహ అధ్యక్షతన జరిగిన మహాసభలో పార్టీ రాష్ట్ర నాయకుడు బొంతల చంద్రారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, మల్లం మహేష్, జిట్ట సరోజ, మండల రూరల్ కార్యదర్శి అర్రూరీ శ్రీను, నాయకులు కత్తుల లింగస్వామి, దేశబోయిన సరస్వతి, అర్రూరీ శంభయ్య, సుర్కంటి బుచ్చిరెడ్డి, మామిడి రాములు, గడ్డం దశరథ పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమ బోర్డు రక్షణకు ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ సలీం

నల్లగొండ టౌన్ : భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమ బోర్డు రక్షణకు ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం అన్నారు. మంగళవారం పట్టణంలోని సుందరయ్య సెంట్రింగ్ సొసైటీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని కార్మిక సంఘాల ప్రతినిధుల భాగస్వామ్యంతో నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో 4వార్డు కౌన్సిలర్ బోగరి ఆనంద్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, పోలే సత్యనారాయణ, సలివోజు సైదాచారి, బిరుదోజు రామాచారి, పాక మల్లయ్య, బచ్చలకూరి గురువయ్య, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక..

అధ్యక్షుడిగా నోముల యాదయ్య, కార్యదర్శిగా దేవరంపల్లి రాంరెడ్డి, డైరెక్టర్లు జక్కలి సత్తయ్య, బత్తుల రవి, బొజ్జ సైదులు, నాగరాజు, రాసమల్ల సైదులు, మన్నే శంకర్, కోఆప్షన్ సభ్యులుగా పికినీటి ముత్యాలచారి, అంతయ్య, మధు ఎన్నికయ్యారు.

పురుగు మందుల వాడకంపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ పురుషోత్తం

కేతేపల్లి : పంటలో తెగుళ్ల నివారణకు పురుగు మందులను తగిన మోతాదులో పిచికారీ చేయాలని మండల వ్యవసాయ అధికారి బి.పురుషోత్తం రైతులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో పురుగు మందుల కొనుగోళ్లు, పిచికారీపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పంటలకు అధిక మోతాదులో పురుగు మందుల వాడడంతో పంట నాణ్యత తగ్గడంతో పాటు పర్యావరణం దెబ్బ తింటుందన్నారు. పురుగు మందులు కొనుగోలు చేసే సమయంలో పురుగు మందు డబ్బాలపై ఉన్న సమాచారాన్ని రైతులు తప్పనిసరిగా పరిశీలించి కొనుగోలు చేయాలన్నారు. సమావేశంలో ఏఈఓలు బాలరాజు, ఉమేష్, నాగరాజు, రైతులు ఉన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దాతలు

మర్రిగూడ : మండలంలోని ఖుదాబక్షపల్లి, యరగండ్లపల్లి గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ టెస్టుకు దరఖాస్తు చేసుకున్న 8వ తరగతి విద్యార్థులకు యూత్ ఫర్ సేవా సహకారంతో నవ నిర్మాణ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా స్టడీ మెటీరియల్, ప్రీవియస్ పేపర్స్ అందజేశారు. కార్యక్రమంలో స్వామి వివేకానంద ఉత్సవ సమితి అధ్యక్షుడు కర్నాటి శ్రీహరి, హెచ్‌ఎం మాలతీ, ఉపాధ్యాయులు రవీందర్, యాదయ్య, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

వయోవృద్ధులకు సన్మానం

చిట్యాల : పట్టణంలోని ఠాగూర్ విద్యాలయంలో మంగళవారం వయోవృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులను పాఠశాల ప్రిన్సిపాల్ పెద్ది నరేందర్ శాలువాతో సన్మానించి ఆర్థికసాయం అందజేశారు. అనంతరం వయో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పెద్ది పద్మ, నమ్ముల ఆనంద్‌కుమార్, షేక్ షమీం, జుబేదా, స్వాతి, రమాదేవి, మౌనిక, ప్రసన్న, కీర్తి, ఆసీయా, మాధవి తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులను సన్మానిస్తున్న పెద్ది నరేందర్

మేతకోసం వెళ్లిన ఆవు.. రాళ్లల్లో ఇరుక్కుని మృతి



రాళ్లల్లో ఇరుక్కుని మృతి చెందిన ఆవు

నార్కట్‌పల్లి : మేతకోసం వెళ్లిన ఓ ఆవు రాళ్లల్లో ఇరుక్కుని మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం నార్కట్‌పల్లి మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల ప్రకారం.. చెర్వుగట్టు గ్రామంలోని శ్రీపార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి భక్తులు మొక్కుబడిగా కోడెలను సమర్పిస్తారు. ఆ కోడెలను దేవస్థానానికి చెందిన భూమిలో ఆలయ సిబ్బంది మేతకు తీసుకెళ్లి సాయంత్రం తీసుకొస్తారు. ఈ క్రమంలో మేతకు వెళ్లిన ఓ ఆవు ఏడాది క్రితం ఆలయ అభివృద్ధికి వాడి దేవస్థానం భూమిలో పడవేసిన రాళ్లలో ప్రమాదశాత్తు ఇరుక్కుని పైకిరాలేక మృతి చెందింది. ఆవు మృతి చెంది రెండు రోజులై దుర్వాసన వస్తుండడంతో సమీప రైతులు గమనించి దేవస్థానం సిబ్బందికి తెలిపారు. మృతి చెందిన ఆవు విలువ రూ.లక్ష వరకు ఉంటుందని ఆలయ సిబ్బంది తెలిపారు.

విద్యార్థులకు టై, బెల్ట్‌లు పంపిణీ

మర్రిగూడ : మండలంలోని దామెరభీమనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మాజీ సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, గ్రామపెద్దలు మలిగిరెడ్డి గోపాల్‌రెడ్డి, మాజీ వార్డు మెంబర్ ఐతరాజు పాపయ్య, వి.సాయిరాం అందించిన టై, బెల్ట్‌లను, ఐడీకార్డులను మంగళవారం ఎంఈఓ బిట్టు శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం ఉదావత్ లచ్చిరాం మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు సహాయ సహకారాలు అందించడం హర్షనీయమన్నారు. అనంతరం దాతలను శాలువాలతో సన్మానించారు. విద్యార్థులు బతుకమ్మ వేడుకల్లో పాల్గొని ఆడిపాడారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు కళా శ్రీనివాస్, శంకర్, రమేష్, పాపయ్య పాల్గొన్నారు.

విద్యా సంస్థల్లో బతుకమ్మ సంబరాలు



నల్లగొండ : బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న భారత్ భవిత స్కూల్ విద్యార్థులు



నల్లగొండ : విపస్య స్కూల్‌లో బతుకమ్మ ఆడతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



మర్రిగూడ : వేడుకల్లో పాల్గొన్న మర్రిగూడ జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు



చిట్యాల : వెలిమినేడు విజయవాణి పాఠశాలలో..



నల్లగొండ : ప్రేరణ స్కూల్‌లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తున్న కరస్పాండెంట్



నకిరేకల్ : మాస్టర్ మైండ్ పాఠశాలలో..



నల్లగొండ టౌన్ : బతుకమ్మలతో బాలికల కళాశాల మహిళా లెక్చరర్లు



చండూరు : గాంధీజీ పాఠశాలలో



రామగిరి(నల్లగొండ) : ఎన్జీ కళాశాలలో..



నల్లగొండ : సిద్ధార్థ డిగ్రీ, పీజీ కళాశాలలో బతుకమ్మ వేడుకలు



నల్లగొండ రూరల్ : ఎంజీ యూనివర్సిటీలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



మునుగోడులో..



శాలిగౌరారం : గీతాంజలి ఉన్నత పాఠశాలలో